RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక



బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 104 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శుక్రవారం | 16.10.2026 | పేజీలు : 8

ఎల్ నినో ఎఫెక్ట్‌తో శాస్త్రవేత్తలు చెప్పినట్లుగానే

నీటి సంక్షోభం

- సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

- ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నీటి, విద్యుత్ సంక్షోభం తప్పదన్న సీఎం
- యాసంగిలో వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలు వేయాలని రైతులకు విజ్ఞప్తి
- గతేడాదితో పోలిస్తే జలాశయాల్లో నీటి నిల్వలు సగానికి పడిపోయినట్లు వెల్లడి
- సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం సహకరించాలని కోరిన సీఎం రేవంత్



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రానున్న రోజుల్లో రాష్ట్రం కఠినమైన నీటి, విద్యుత్ కొరతను ఎదుర్కోక తప్పదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎల్ నినో విషయంలో శాస్త్రవేత్తలు అంచనా వేసిన ట్లుగానే పరిస్థితులు చేయిదాటిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ప్రజల దైనందిన జీవితంపై ప్రభావం చూపుతుందని, ప్రజలు, ముఖ్యంగా రైతాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్ నినో పరిస్థితులపై మంత్రులతో సమీక్ష నిర్వ హించిన అనంతరం మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక వివరాలను వెల్లడించారు. గతేడాది ఇదే సమయానికి రాష్ట్రంలోని జలా శయాల్లో 400 టీఎంసీలకు పైగా నీటి నిల్వలు ఉండగా, ప్రస్తుతం అవి కేవలం 209 టీఎంసీలకు పరిమితమయ్యాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న ఈ స్వల్ప జలాలను అత్యంత పొదుపుగా వాడుకోవాలని, తాగునీటి అవసరాలకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు...

2

'మనం చేసి చూపిద్దాం'

- ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం

- ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ
- క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి
- భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన
- క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల చారిత్రక విజయాలపై ప్రశంసలు

2

సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా

- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు


- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ
- ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్



2

'న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు'.. రాహుల్ గాంధీ ప్రవర్తనపై వివరణ కోరిన సుప్రీం

- సుప్రీంకోర్టు వరకు ర్యాలీగా వెళ్లి రాహుల్‌పై సుప్రీం అసహనం
- తన చర్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశం
- న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను సహించబోమని స్పష్టీకరణ



నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరుపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఆయన వివరణ ఇవ్వాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను సహించబోమని, ఎవరూ న్యాయవ్యవస్థను బెదిరించ లేరని వ్యాఖ్యానించారు. అక్టోబర్ 12న రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నేతలు .....

2

ఢిల్లీలో సీజేపీ నిరసన..

అడ్డుకోలేమన్న హైకోర్టు



2

ఇస్లాంలోకి మారితే బీసీ రిజర్వేషన్ వర్తించదు..

సుప్రీంకోర్టు కీలక తీర్పు



- మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- తమిళనాడు ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- 2024లో మతం మారిన వారికి రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్రం ఉత్తర్వులు
- బీసీ ముస్లిం కేటగిరీలో ఏడు గుర్తింపు పొందిన సమాజాలు
- మతం మారడం వల్ల ఆ సమాజాల్లో సభ్యత్వం ఆటోమేటిక్‌గా రాదన్న హైకోర్టు

2

రైతుబీమా అమలు చేయకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తం - హరీష్ రావు

- పథకం బంద్ పెట్టి అన్నదాతల ఉసురు పోసుకుంటున్న సర్కార్
- రేవంత్‌రెడ్డి తీరు వల్ల 3వేల రైతు కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి
- బాధిత కుటుంబాలకు 5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- యథావిధిగా రైతుబీమా పథకాన్ని అమలుచేయాలి
- లేకపోతే సీఎం ఇల్లు, సెక్రటేరియట్‌ను ముట్టడిస్తం
- రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డ హరీష్‌రావు



నిత్యం నిఘా, సిద్దిపేట : ఆపద సమయంలో ఆదుకొనే రైతుబీమా పథకాన్ని వెంటనే అమలుచేయకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు హెచ్చ రించారు. రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ, కేసీఆర్ అమలుచేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసి వాళ్ల ఉసురు పోసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజక వర్గంలో రైతుబీమా అందని 22 మంది కుటుంబాలతో గురువారం సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ ఆగస్టు 15నుంచి ఇప్పటివరకు ఒక సిద్దిపేటలో 22మంది, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3వేల మంది రైతులు మృతిచెందారని, ప్రభుత్వం రైతుబంధు నిలిపి వేయడం వల్ల ఆ మూడు వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుబీమా అమలు చేసి ఉంటే అన్ని కుటుంబాలు ఎందుకు కన్నీళ్లు పెడుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆగస్టు 14నుంచి ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకపోవడం వల్లే రాష్ట్రంలో రైతుబీమా ఆగిపోయిందని చెప్పారు. మరి ఇప్పుడు వారికి ఏం సమాధానం చెబుతారని, ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందో చెప్పాలని .....

2

'సర్' వివాదం.. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'స్పెషల్ సమ్మరీ రివిజన్'

- తెలుగు రాష్ట్రాలకు త్వరలో ప్రకటన

- ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై తీవ్ర వివాదం
- 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు ఈసీ ఆదేశం
- 2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎన్నికల సంఘం



2

24 లక్షల ఎకరాల అటవీ భూమి ఏమైంది?:

ప్రభుత్వానికి బీజేపీ నేత సూటి ప్రశ్న

- తెలంగాణలో 24 లక్షల ఎకరాల అటవీ భూమి మాయమైందని బీజేపీ ఆరోపణ
- పెద్ద నాయకులే ప్రభుత్వ, పేదల భూములను కబ్జా చేస్తున్నారని విమర్శ
- అసైన్డ్ భూముల అమ్మకానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని మహేశ్వర్ రెడ్డి ఆరోపణ



2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఎల్ నినో ఎఫెక్ట్‌తో శాస్త్రవేత్తలు
చెప్పినట్లుగానే నీటి సంక్షోభం
: సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి.. వచ్చే ఎనిమిది నెలల కాలం అత్యంత కీలకమని, ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతాంగం పరిస్థితులను అర్థం చేసుకుని సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. యాసంగి సీజన్‌లో వరి సాగును పక్కనపెట్టి, తక్కువ నీటి వినియోగంతో పండే ఆరుతడి పంటలకే మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రైతులు ఈ త్యాగానికి సిద్ధపడాలని, ఒక సీజన్ పాటు వరి సాగును వాయిదా వేసుకోవాలని విన్నవించారు.

'న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు'..
రాహుల్ గాంధీ ప్రవర్తనపై వివరణ కోరిన సుప్రీం

మొదటిపేజీ తరువాయి.. సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల సంఘం నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం రాహుల్ గాంధీ స్వయంగా సుప్రీంకోర్టుకు వెళ్లి, ఈ అంశంపై ఉమ్మడి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా రాహుల్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా ఏర్పడిన గందరగోళాన్ని ప్రస్తావిస్తూ, రాహుల్ తన చర్యలపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

రైతుబీమా అమలు చేయకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తం - హరీష్ రావు

మొదటిపేజీ తరువాయి.. హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఐక్యరాజ్యసమితి సైతం మెచ్చుకున్న రైతు బీమా పథకాన్ని నిలిపివేయడానికి ప్రభుత్వానికి మనసెలా వచ్చిందని ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాలు మన పథకాన్ని చూసి అమలు చేస్తుంటే.. ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బంద్ చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతు సంక్షేమం గురించి గొప్పలు చెప్పే రేవంత్‌రెడ్డికి రూ.1,400 కోట్ల ప్రీమియం చెల్లించే తెలివి లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాణాలు కోల్పోయిన 3వేల మంది రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ వెంటనే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించి యథావిధిగా రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగిరాకపోతే రైతు కుటుంబాలతో కలిసి సీఎం ఇంటిని, సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతు కుటుంబాలు ఆందోళన చెందవద్దని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అసెంబ్లీ వేదికగా రైతు బీమా అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, బీమా డబ్బులు వచ్చేలా చేస్తామని చెప్పారు.

ఢిల్లీలో సీజేపీ నిరసన..
అడ్డుకోలేమన్న హైకోర్టు

మొదటిపేజీ తరువాయి.. హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఐక్యరాజ్యసమితి సైతం మెచ్చుకున్న రైతుఎన్నికల అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అక్టోబర్ 16 (శుక్రవారం) ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌లో జరగనున్న ఈ ఆందోళనను నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నిరసనను చట్టప్రకారం నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని కోర్టు నమోదు చేసుకుంది. దసరా పండుగ సీజన్‌లో ఈ నిరసన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, తద్వారా తీవ్రంగా నష్టపోతామని ఓ వీధి వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. కన్నాట్ ప్లేస్ నిరసనలకు వేదిక కాదని, ఈ ఆందోళనను నిలిపివేయాలని ఆయన తరపు న్యాయవాది వాదించారు. అయితే, సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు విన్నవించారు. ఈ వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం, నిరసనను నిలిపివేయడానికి నిరాకరించింది. మరోవైపు, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల అక్రమాలపై గళమెత్తుతున్న విద్యార్థులు, యువతను పోలీసులు ఈడ్చిపారేస్తున్నారని ఆరోపించారు. వారికి మద్దతుగా వచ్చిన రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రతిపక్ష నేతలను సైతం నిర్బంధించారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ వెనకేసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ పిలుపునిచ్చిన ఈ నిరసనలో తాము కూడా పాల్గొంటామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. నిరసనకారులు జాతీయ జెండాలతో తరలిరావాలని దీప్కే పిలుపునిచ్చారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ ఎన్నికల సంఘానికి, కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు ప్రాంగణంలో మార్చ్ నిర్వహించడంపై దాఖలైన మరో పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా "న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు" అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ నిరసన నాటి సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని అధికారులను ఆదేశించారు.

'మనం చేసి చూపిద్దాం'...
ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం

మొదటిపేజీ తరువాయి.. భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకిత భావాన్ని, వారు సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈసారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు. భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు.

సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా
- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు. తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

ఇస్లాంలోకి మారితే బీసీ రిజర్వేషన్ వర్తించదు..
సుప్రీంకోర్టు కీలక తీర్పు

మొదటిపేజీ తరువాయి.. హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారినంత మాత్రాన తమిళనాడులోని బీసీ ముస్లిం (బీసీఎం) రిజర్వేషన్ ప్రయోజనాలు పొందలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్ తో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి ఇతర మత సామాజిక వ్యవస్థలోకి మారిన వ్యక్తి.. గతంలో తనకు ఉన్న సామాజిక వెనుకబాటుతనాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) కింద రిజర్వేషన్ కోరలేరని ధర్మాసనం పేర్కొన్నట్లు బార్ అండ్ బెంచ్ వెల్లడించింది. మత మార్పిడి జరిగినంత మాత్రాన గుర్తింపు పొందిన వెనుకబడిన ముస్లిం సమాజాల్లో ఏదో ఒకదానికి చెందినవారిగా పరిగణించలేమని స్పష్టం చేసింది. 2024 మార్చి 9న తమిళనాడు ప్రభుత్వం ఓ ఉత్తర్వు జారీ చేసింది. వెనుకబడిన తరగతులు (బీసీ), అత్యంత వెనుకబడిన తరగతులు (ఎంబీసీ), డీనోటిఫైడ్ కమ్యూనిటీలు (డీఎన్ సీ), షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) చెందినవారు ఇస్లాంలోకి మారితే.. వారికి బీసీ ముస్లిం కేటగిరీలో కమ్యూనిటీ సర్టిఫికెట్లు ఇచ్చి రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించాలని అందులో పేర్కొం ది. అయితే, ఈ ఉత్తర్వును మద్రాస్ హైకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది. తమిళనాడులో బీసీ ముస్లింలుగా గుర్తించిన ఏడు సమాజాల్లో సభ్యత్వం జన్మ ఆధారంగా నిర్ధారితమవుతుందని, మతం మారడం వల్ల మా త్రమే వాటిలో సభ్యత్వం లభించదని తెలిపింది. ఈ తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తమిళనాడులో బీసీ ముస్లిం కేటగిరీ కింద అన్సార్, డెక్కనీ ముస్లింలు, దుబేకులా, లబ్బాయిస్ (రోవ్‌థర్, మరక్కాయర్ సహా), మాపిళ్ల, షేక్, సయ్యద్ సమాజాలను గుర్తించారు. హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారినంత మాత్రాన వీటిలో ఏదో ఒక సమాజానికి చెందినవారిగా ధ్రువీకరించలేమని హైకోర్టు పేర్కొంది. ప్రభుత్వం మాత్రం మత మార్పిడి వల్ల సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగిపోదని వాదించింది. రిజర్వేషన్ ప్రయోజనాలు కోల్పోకుండా చూడటమే ఉత్తర్వు ఉద్దేశమని తెలిపింది. కానీ సుప్రీంకోర్టు ఆ వాదనను అంగీకరించలేదు. ఈ కేసు సమీర్ అహ్మద్ అనే వ్యక్తి పిటిషన్‌తో మొదలైంది. ఆయన 2015లో హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారి, లబ్బాయి ముస్లిం సమాజానికి చెందిన వ్యక్తిగా కమ్యూనిటీ సర్టిఫికెట్ కోరారు. అధికారులు దరఖాస్తును తిరస్కరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో భాగంగానే తమిళనాడు ప్రభుత్వ ఉత్తర్వుపై న్యాయపోరాటం సాగింది.

'సర్' వివాదం.. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'స్పెషల్ సమ్మరీ రివిజన్'..
తెలుగు రాష్ట్రాలకు త్వరలో ప్రకటన

మొదటిపేజీ తరువాయి.. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ప్రక్రియపై చెలరేగుతున్న వివాదాల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. 'సర్' నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దే లక్ష్యంతో, 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాకు "స్పెషల్ సమ్మరీ రివిజన్" (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటు హక్కు పొందే యువతతో పాటు, సాంకేతిక కారణాల వల్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారిని చేర్చేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బిహార్, తమిళనాడు వంటి కీలక రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. 2027 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. తాజా షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 12న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 2027 జనవరి 4న తుది జాబితాను విడుదల చేస్తారు. కాగా, 2027 ఫిబ్రవరి నాటికి ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది. 'సర్' ప్రక్రియలో భాగంగా భారీస్థాయిలో ఓటర్ల పేర్లను తొలగించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా, ఫారం-6తో పాటు ఓటర్లు ఒక అదనపు డిక్లరేషన్ సమర్పించాలన్న నిబంధన వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం జరిగిన 'సర్' వివరాలతో ప్రస్తుత దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వివరాలను అనుసంధానం చేయాలని కోరడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయని, ఓటర్లను ఇబ్బందులకు గురిచేసేలా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. ఈ వివాదం నేపథ్యంలో 'ఇండియా' కూటమి పార్టీలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వంటి యువజన సంఘాలు ఢిల్లీలో నిరసనలు చేపట్టాయి. తక్షణమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతున్న లేదా ఇటీవలే పూర్తయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో 'ఎస్ఎస్ఆర్' షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదేవిధంగా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇప్పటివరకు 'సర్' ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో కూడా ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను తగిన సమయంలో వెల్లడిస్తామని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 29న ఇచ్చిన ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్రాల అధికారులకు సూచించినట్లు ఈసీ గుర్తు చేసింది.

24 లక్షల ఎకరాల అటవీ భూమి ఏమైంది?: ప్రభుత్వానికి బీజేపీ నేత సూటి ప్రశ్న

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో దాదాపు 24 లక్షల ఎకరాల అటవీ భూమి లెక్కల్లో వ్యత్యాసం కనిపిస్తోందని, ఆ భూమి ఏమైందో ప్రభుత్వం స్పష్టం చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ప్రముఖ నాయకులే ఈ భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. నేడు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూముల అక్రమాలకు సంబంధించిన గణాంకాలను ఆయన వివరించారు. అధికారిక రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 66,33,313 ఎకరాల అటవీ భూమి ఉండాల్సి ఉండగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేవలం 42.53 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ భారీ వ్యత్యాసంపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం అసైన్డ్ భూముల విక్రయానికి సిద్ధమవుతోందని, ఇది పేద ప్రజలకు తీరని అన్యాయం చేయడమేనని ఆయన విమర్శించారు. గతంలోని ధరణి పోర్టల్ నుంచి నేటి భూభారతి వరకు కేవలం పేర్లు మాత్రమే మారాయని, అక్రమాలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గతంలో న్యాయస్థానం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసిన సెక్షన్ 22ఏను, ప్రభుత్వం కొన్ని సవరణలతో నేటికీ కొనసాగించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ఆయన ప్రశ్నించారు. ఈ ఆరోపణలతో తెలంగాణలో భూ రికార్డులు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై రాజకీయ చర్చ మరింత ఊపందుకుంది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బెస్తం చెరువు వద్ద సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను వేగవంతం చేయాలి

వరంగల్, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రంగశాయిపేటలోని బెస్తం చెరువు వద్ద చేపడుతున్న ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని 42వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అధికారులకు సూచించారు.గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్న బెస్తం చెరువు ప్రాంతాన్ని ఆమె సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మలతో వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు.బెస్తం చెరువు మైదాన ప్రాంతంతో పాటు ఉర్సు బైపాస్ రోడ్డు వైపు వెళ్లే మెటల్ రోడ్డు, ఖమ్మం రోడ్డులోని నాయుడు పంపు వైపు వెళ్లే మెటల్ రోడ్లపై డస్ట్ చల్లిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా పండుగకు వచ్చే మహిళలకు ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో లైటింగ్, సౌండ్ సిస్టమ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.సంబంధిత అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ,



నిర్ణీత సమయంలోగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహారాములు, శానిటరీ ఇన్స్పెక్టర్ భీమయ్య, శానిటరీ జవాన్లు అశోక్, ప్రణీత్, ప్రశాంత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాలసముద్రంలో ఘనంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

హనుమకొండ, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్దన్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి డాక్టర్ అబ్దుల్ కలాం అందించిన శాస్త్రసాంకేతిక, క్షిపణి రక్షణ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. 'మిస్సైల్ మ్యాన్'గా భారత రక్షణ రంగాన్ని ప్రపంచ స్థాయిలో నిలబెట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.సామాన్య కుటుంబంలో జన్మించి దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవిని అధిష్ఠించినప్పటికీ, నిరాడంబర జీవితాన్ని గడిపిన మహనీయుడు కలాం అని గుర్తుచేశారు. విద్యార్థులు, యువతకు నిరంతరం స్ఫూర్తినిస్తూ, దేశాభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేశారని



అన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని యువత శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించడంతోపాటు దేశ పురోగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డంప్‌యార్డ్‌ను తలపిస్తున్న భద్రాచలం ఏఎస్ఆర్ కాలనీ వీధులు

భద్రాచలం, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):భద్రాచలంలోని ఏఎస్ఆర్ కాలనీ వీధులు చెత్తాచెదారం, మురుగునీటితో నిండిపోయి డంప్‌యార్డ్‌ను తలపిస్తున్నాయి. గత రెండు నెలలుగా పంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు కాలనీ వైపు కన్నెత్తి చూడకపోవడంతో పారిశుధ్యం పూర్తిగా క్షీణించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.కాలనీలోని వీధుల్లో డ్రైనేజీలు పొంగి పార్లుతూ, చెత్త కుప్పలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. రోడ్లపై నడవాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల పక్కన పిచ్చి మొక్కలు, పాదలు పెరిగిపోవడంతో పాటు చెత్త పేరుకు పోవడంతో పాములు, ఎలుకలు సంచరిస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు.

అధికారులు స్పందించాలి

ఏఎస్ఆర్ కాలనీలో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై సంబంధిత పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యనిర్వహణ అధికారి (ఈఓ), సర్పంచ్ తక్షణమే స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, డ్రైనేజీలను శుభ్రం చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, పాదలను తొలగించి పారిశుధ్య పనులు వేగవంతం



చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేతన్న భరోసా, థ్రిఫ్ట్ ఫండ్ నిధులను తక్షణమే విడుదల చేయాలి

హనుమకొండ, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేతన్న భరోసా', 'థ్రిఫ్ట్ ఫండ్' పథకాలకు సంబంధించిన నిధులను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.హనుమకొండలో నిర్వహించిన తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాల నిధులు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసి చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. నిరుపేద నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి కుటుంబాలను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.చేనేత రంగ పరిరక్షణ తోపాటు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని తాటిపాముల వెంకట్రాములు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో



సంఘం ముఖ్య నాయకులు లక్ష్మీ నరసయ్య, కోట రాజయ్య, ధనంజయ్, చంద్రప్రకాష్‌తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరల పంపిణీ

జనగామ జిల్లా/పాలకుర్తి, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): దసరా పండుగను పురస్కరించుకొని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలకుర్తి మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ వెనుక నివాసం ఉంటున్న సుమారు 15 మంది నిరుపేద మహిళలకు గురువారం చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ పండుగ వేళ నిరుపేద మహిళలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజంలోని పేదలకు తమ వంతు సహాయం అందించడం, పండుగను సంతోషంగా జరుపుకునేలా చేయూతనివ్వడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్



చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ట్రస్ట్ కోశాధికారి ఒర్రె కుమారస్వామి, ట్రస్ట్ ప్రతినిధి పల్లెపు శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో చండిక అమ్మవారి దర్శనం

- పాలకుర్తిలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు



జనగామ జిల్లా/పాలకుర్తి, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఐదో రోజు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో చండిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చనతో పాటు చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల రాకతో ఆలయం సందడిగా మారింది.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి





వరంగల్, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పథకం కింద వివిధ కేడర్లలో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా శాఖ సంఘీభావం తెలిపింది. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గాజే వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ కూడలిలో నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా గాజే వేణుగోపాల్ మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కొన్ని కేడర్లలో తగ్గించిన జీతభత్యాలను వెంటనే సవరించాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి, స్టేట్ హెల్త్ సొసైటీ ద్వారా జీతభత్యాలు చెల్లించాలని సూచించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి టీఎన్జీవోస్ యూనియన్ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం మాట్లాడుతూ, రెగ్యులర్ ఉద్యోగులకు అందించే అన్ని ప్రయోజనాలను నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని కోరారు. పారుగు సేవల ఒప్పంద కార్మికుల వ్యవస్థను రద్దు చేసి, ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని డిమాండ్ చేశారు. అర్హులైన మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగికి కేడర్ ఫిక్సేషన్ చేసి 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని అన్నారు. కాంటింజెంట్ వర్కర్ల నుంచి వైద్యుల వరకు అర్హులైన ఉద్యోగులందరినీ ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ సిటీ అధ్యక్షుడు శంకేశి రాజేష్, నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ భరత్ కుమార్, నితిన్, అర్చన, అనిల్, అనూష, సుజాత, సునీతతో పాటు పలువురు నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

వ్యాపార అనుమతి లేకుండానే
రెండేళ్లుగా దుకాణం నిర్వహణ



పెద్దపల్లి జిల్లా, మంథని, అక్టోబర్ 15 (నిత్యం నిఘా):మంథని మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఎస్‌వీ మార్ట్ ఎలక్ట్రానిక్స్ అండ్ సూపర్ మార్కెట్‌కు మున్సిపల్ అధికారులు రూ.50 వేల జరిమానా విధించారు.గత రెండేళ్లుగా మున్సిపాలిటీ నుంచి తప్పనిసరిగా పొందాల్సిన వ్యాపార అనుమతి లేకుండానే దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ విషయంపై పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ యాజమాన్యం అనుమతి పొందకపోవడంతో జరిమానా విధించినట్లు తెలిపారు.

అనుమతులు తప్పనిసరి

మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యాపార అనుమతి పొందాలని మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహించే దుకాణాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వ్యాపారులు మున్సిపల్ నిబంధనలను పాటిస్తూ, అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని కమిషనర్ సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- **వరంగల్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలనలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**





వరంగల్, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నూతన మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ సీతక్కతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే వరంగల్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఆసుపత్రి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. ఆధునిక వైద్య సదుపాయాల విస్తరణతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ గుండు సుధారాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- **మంథనిలో అంబులెన్స్ కరువు..**
  గంటన్నరైనా స్పందించని అత్యవసర సేవలు

పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రుల ప్రాణాలు కాపాడాల్సిన అత్యవసర అంబులెన్స్ సేవలే అందుబాటులో లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు మంథని ప్రాంతంలో తలెత్తుతున్నాయి. ప్రమాదంలో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
బుధవారం సాయంత్రం సుమారు ఐదు గంటల సమయంలో మంథని–కాటారం ప్రధాన రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను గమనించిన వాహనదారులు అంబులెన్స్ కోసం ఫోన్ చేసినప్పటికీ, సుమారు గంటన్నర పాటు స్పందన రాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ సేవలు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైకుంఠ రథాల కంటే అంబులెన్సులకే ప్రాధాన్యమివ్వాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంథని ప్రాంత ప్రజల వైద్య అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మరణించిన వారి అంత్యక్రియలకు వైకుంఠ రథాలు అవసరమే అయినప్పటికీ, ప్రాణాపాయంలో ఉన్నవారిని సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే అంబులెన్సులు మరింత అత్యవసరమని పేర్కొంటున్నారు. ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేస్తున్నారు.
మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో 108 అంబులెన్స్ నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించే వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం సకాలంలో వైద్య సేవలు అందేలా ప్రతి మండలానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ప్రచార ఆర్భాటాలు కాదు.. నాణ్యమైన వైద్యం కావాలి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య పరికరాలు, మందులు, వైద్య పరీక్షల సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యమైన వైద్య విభాగాల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని పేదలకు ప్రభుత్వ ఆసుపత్రులే ఆధారమని, అక్కడ కనీస సదుపాయాలు లేకపోతే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.



ఉచిత బస్సు ప్రయాణం, చీరల పంపిణీ వంటి సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు అత్యంత అవసరమైన ఉచిత విద్య, నాణ్యమైన వైద్యానికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేసి, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించాలని కోరుతున్నారు.
ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో 108 అంబులెన్స్ అందుబాటును నిర్ధారించడంతో పాటు పరిసర మండలాల్లో అత్యవసర వైద్య సేవలను విస్తరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హామీలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వైద్య సదుపాయాలు కల్పించాలని, ప్రజలకు ఉచిత విద్య, నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కళ్యాణలక్ష్మితో పేదింటి ఆడబిడ్డలకు భరోసా

పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. గురువారం సుల్తానాబాద్ పట్టణంలోని ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో సుల్తానాబాద్ పట్టణం, మండలంతో పాటు ఎలిగేడు మండలానికి చెందిన 140 మంది లబ్ధిదారులకు రూ.1,40,16,240 విలువైన చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ మున్సిపల్ కార్మికులకు దుస్తులు, పాదరక్షలను అందజేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్న వడ్లకు బోనస్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ధాన్యం కొనుగోళ్లు చేపడుతూ, సన్న వడ్లకు బోనస్ అందిస్తున్నట్లు వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తన వంతు కృషి చేస్తానని, పదవిలో ఉన్నా లేకున్నా రైతులు, ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

రానున్న యాసంగి సీజన్‌లో వాతావరణ పరిస్థితులు, ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా భూగర్భ జలాలు తగ్గి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని సూచించారు.రైతులు ఏ పంట సాగు చేసినా దాని కొనుగోలుకు ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



బీఆర్ఎస్‌కు రాజీనామా.. కాంగ్రెస్‌లో చేరిక

సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామ ఉపసర్పంచ్ కవ్వంపల్లి కార్తీక్ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుముల ప్రకాష్ రావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, తహసీల్దార్ బషీరుద్దీన్, మున్సిపల్ కమిషనర్ రమేష్, సుల్తానాబాద్, ఎలిగేడు మండలాల సింగిల్ విండో చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సుఖసంతోషాల కోసం దుర్గామాతకు ప్రత్యేక పూజలు

భూపాలపల్లి జిల్లా/ కాటారం, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):కాటారం మండలం ధన్వాడ గ్రామంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన చండీ హోమం కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని వేడుకున్నారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం నిండాలని ప్రార్థించారు.అనంతరం వేద పండితులు దుద్దిళ్ల శ్రీనుబాబు దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు సద్దుల బతుకమ్మ, విజయదశమి పండుగల ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రజలందరూ పండుగలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఉద్యోగుల ఐక్యతే టీజీఈజేఏసీ బలం

- **ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూనే సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తెద్దాం**
- **ప్రజా ప్రభుత్వంలోనే ఎన్నో విజయాలు సాధించుకున్నాం: టీజీఈజేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి**



వరంగల్, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): ఉద్యోగుల ఐక్యతే తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ)కి ప్రధాన బలమని ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ వి. లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఐక్యంగా ఉంటే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించవచ్చని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూనే అవసరమైన ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులకు స్వేచ్ఛాయుత వాతావరణం ఏర్పడిందని, గత పదేళ్లలో పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పరిష్కరించుకోగలిగామని తెలిపారు. తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో గురువారం వరంగల్‌లో నిర్వహించిన ఉద్యోగుల ముఖాముఖి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమితి నాయకుడు ఇక్బాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి మొండ్రాల రాజశేఖర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి సంక్షేమమే లక్ష్యంగా టీజీఈజేఏసీ పనిచేస్తోందని లచ్చిరెడ్డి తెలిపారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం ప్రభుత్వంతో చర్చలు జరుపుతూనే, సఖ్యతతో ముందుకు సాగడం ద్వారా అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఉద్యోగులకు రెండు కరువు భత్యాల మంజూరు, కొత్త ఆరోగ్య పథకం అమలు, రూపాయి కూడా చెల్లించకుండా వైద్య సేవలు పొందే అవకాశం కల్పించే విషయంలో సమితి చేసిన కృషి ఫలించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో భవిష్యత్తులోనూ ఉద్యోగులకు మరిన్ని ప్రయోజనాలు సాధించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముఖాముఖి

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని ఉద్యోగుల సమస్యలు అనేకం ఉన్నాయని లచ్చిరెడ్డి అన్నారు. ప్రతి ఉద్యోగి సమస్యను నేరుగా తెలుసుకొని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలనే ఉద్దేశంతో ముఖాముఖి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా సేకరించిన సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, పరిష్కార మార్గాలపై సలహాలు, సూచనలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించాలి

ఉద్యోగుల సంఖ్య తగ్గిందని, ఎన్నికల్లో వారి పాత్ర పరిమితమని కొందరు అభిప్రాయపడుతున్నారని లచ్చిరెడ్డి అన్నారు. అయితే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని స్పష్టం చేశారు. ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కలిస్తే పెద్ద సంఖ్యలో ఓటర్లుగా మారే అవకాశం ఉందన్నారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఉద్యోగి ముందుగా పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు కూడా అర్హత ఉంటే ఓటరుగా నమోదు చేయించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ నాయకులు ఎస్. రాములు, కె. మహిపాల్‌రెడ్డి, బాణాల రాంరెడ్డి, రమేష్ పాక, పూల్‌సింగ్ చౌహాన్, తెలంగాణ గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర సహాయ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ కృష్ణుడు, గరికె ఉపేంద్రరావు, హబీబుద్దీన్, ఉపేందర్, శ్రీకాంత్‌గౌడ్, వరే భిక్షం, బుచ్చయ్య, వై. కుమార్, అజీజ్, సుదర్శన్‌గౌడ్, రాజేశ్వరరావు, మురళీ, శ్రీనివాస్, కృష్ణంరాజు, తిరుపతి, వేణు, అర్జున్ మల్లారం, శిరీషారెడ్డి, బుచ్చిబాబు, నర్సమ్మ, కె. సతీష్, పులిరాజు, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళీ అమ్మవారి ఐదవ రోజు అలంకారంలో లలితా త్రిపురసుందరి

- **భక్తులకు పల్లకీ సేవ, శేషవాహన సేవతో దివ్యదర్శనం**
- **భద్రకాళీ దేవస్థానంలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం**



వరంగల్, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి) వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గురువారం అమ్మవారు లలితా మహా త్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ, సాయంత్రం శేషవాహన సేవ నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నాలుగు గంటలకు అర్చకులు నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం అమ్మవారిని రాజరాజేశ్వరి (లలితా త్రిపురసుందరి)గా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రాలకు అధిష్ఠాన దేవతగా రాజరాజేశ్వరి అమ్మవారిని ఆరాధించడంలోని ఆధ్యాత్మిక విశిష్టతను ప్రధానార్చకుడు భద్రకాళి శేషు వివరించారు. ఐశ్వర్యం శాశ్వతం కాదని, భగవంతుని పాదాలపై అచంచలమైన భక్తి, అంతిమంగా ముక్తి ప్రసాదించాలని సాధకుడు కోరుకోవాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని ఈ అలంకారం తెలియజేస్తుందని పేర్కొన్నారు. పంచదశీ, షోడశీ మంత్రదీక్షల ప్రాధాన్యాన్ని వివరిస్తూ, శాస్త్రోక్త విధానాల ప్రకారం అమ్మవారికి పూజారాధనలు నిర్వహించినట్లు తెలిపారు.

స్కందమాతా క్రమంతో పాటు బోధాయన మహర్షి ప్రోక్త నవరాత్రి కల్పాన్ని అనుసరించి ధూమ్రహ క్రమంలోనూ పూజలు నిర్వహించారు. ఉదయం పల్లకీ సేవ, సాయంత్రం శేషవాహన సేవ భక్తిశ్రద్ధలతో సాగాయి. పల్లకీ సేవలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు సమస్త భోగాలు కలుగుతాయని, శేషవాహనంపై అమ్మవారిని దర్శించుకోవడం వల్ల యోగసిద్ధి లభిస్తుందని ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు.

ఉభయదాతలకు సత్కారం.. భక్తులకు అన్నదానం

ఐదవ రోజు ఉత్సవాలకు వాగ్దేవి విద్యాసంస్థల అధినేతలు చందుపట్ల దేవేందర్‌రెడ్డి, వాణీదేవి, వాహినీదేవి, శ్రీ కళా సారీస్ అండ్ ఫ్యాబ్రిక్స్ అధినేతలు పింగిళి పవన్‌రెడ్డి, శ్రీలత దంపతులు, పల్లె లక్ష్మణరావుగౌడ్, సువర్ణ దంపతులు తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజల అనంతరం వారికి అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి రామల సునీత పర్యవేక్షించారు. భద్రకాళీ సేవా సమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు

దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ కృష్ణప్రసాద్, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ రమాదేవి తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారికి మహదాశీర్వచనం అందించి, శేషవస్త్రాలు, ప్రసాదాలు బహూకరించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

దేవస్థాన ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమక్షంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి రామల సునీత ప్రమాణ స్వీకారం చేయించారు. మండలి చైర్మన్‌గా డాక్టర్ బి. శివసుబ్రహ్మణ్యంతో పాటు ధర్మకర్తలుగా కమటం వేణుగోపాల్, కల్లూరి పవన్‌కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్‌బాబు, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, చిదర అంజనీదేవి, మాడిశెట్టి సతీష్, పేరాల శ్రీనివాసరావు, రమేష్ చందర్ భంగ్, చింతలపణి వాసవిరెడ్డి, మోతుకూరి మయూరి ప్రమాణ స్వీకారం చేశారు. ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా పార్నంది నర్సింహామూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను దేవస్థానం అధికారులు సమన్వయంతో నిర్వహిస్తున్నారు.

బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

- **జమ్మి చెట్టు గద్దె, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులపై సమీక్ష**



పెద్దపల్లి జిల్లా/ మంథని, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు మంథని మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్ తమ్మ చెరువు కట్ట పరిసరాలను పరిశీలించారు. దసరా పండుగ నేపథ్యంలో జమ్మి చెట్టు గద్దె ప్రదేశంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను సందర్శించి ఏర్పాట్లు, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.తమ్మ చెరువు కట్ట వద్ద నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన చైర్మన్ మహిళలు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రదేశంలో తగినంత వెలుతురు ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన చోట సుందరీకరణ పనులు చేపట్టాలని ఆదేశించారు.దసరా పండుగ సందర్భంగా ప్రజలు సంప్రదాయబద్ధంగా జమ్మి పూజలు నిర్వహించుకునేందుకు జమ్మి చెట్టు గద్దె వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బతుకమ్మ, దసరా పండుగలను మంథని ప్రజలు ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా మున్సిపాలిటీ తరపున అవసరమైన ఏర్పాట్లు చేపడతామని పోడ్నాల శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యుడు ఎల్లంకి వంశీధర్, నాయకుడు జంబోజు సమ్మయ్య పాల్గొన్నారు.

హనుమకొండ బస్టాండ్‌లో ప్రయాణికుల అవస్థలు

- **పరకాల, భూపాలపల్లి, ములుగు మార్గాల్లో బస్సుల కొరత.. అదనపు సర్వీసులు నడపాలని ప్రయాణికుల డిమాండ్**



హనుమకొండ, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):హనుమకొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటంతో పలు మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పరకాల, భూపాలపల్లి, ములుగు మార్గాల్లో బస్సుల సంఖ్య ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో విధులకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర పనుల నిమిత్తం ప్రయాణించే ప్రజలు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగలు, సెలవు దినాల్లో రద్దీ మరింత పెరగడంతో బస్సులు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. పరకాల, భూపాలపల్లి, ములుగు మార్గాల్లో అదనపు బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన చోట ప్రత్యేక ట్రిప్పులు నడపాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వెంకటాపురం, వాజేడు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులుగా హుస్సేన్, విక్రాంత్

ములుగు జిల్లా, వాజేడు, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):ములుగు జిల్లాలోని వెంకటాపురం, వాజేడు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ప్రకటించారు. రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క సూచనల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ గురువారం ఈ నియామకాలను వెల్లడించారు. వెంక టాపుర ం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సయ్యద్ హుస్సేన్, వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కాకర్లపూడి విక్రాంత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా పైడాకుల అశోక్ నూతన అధ్యక్షులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. మండలాల్లో సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తూ, అన్ని స్థానాల్లో అత్యధిక మెజారిటీ సాధించేలా కార్యాచరణ చేపట్టాలని కోరారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

భక్తిపారవశ్యంలో వర్ధన్నపేట

- లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో దుర్గమ్మ.. దర్శనానికి పోటెత్తిన భక్తజనం



వరంగల్ జిల్లా, వర్ధన్నపేట, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):వర్ధన్నపేటలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఉత్సవ ప్రాంగణం భక్తజన సందోహంతో సందడిగా మారింది.

పుష్పాలంకరణలతో శోభాయమానంగా మండపం

వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలు, రంగురంగుల అలంకరణలతో ఉత్సవ మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు సామూహికంగా కూర్చొని భక్తిశ్రద్ధలతో పారాయణాలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల ప్రార్థనలతో పరిసర ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

సుఖశాంతులు, సౌభాగ్యం కలగాలని ప్రత్యేక పూజలు

లలితా త్రిపుర సుందరి దేవిని ఆరాధించడం ద్వారా సుఖశాంతులు, సౌభాగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, స్థానిక భక్తులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలతో వర్ధన్నపేటలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ప్రవీణ్ భోగం



వరంగల్ జిల్లా/వర్ధన్నపేట, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా ప్రవీణ్ భోగం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.ప్రజలు తమకు ఎదురయ్యే సమస్యలపై నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రతి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజలకు భరోసా కల్పిస్తూ, నేరాల నియంత్రణకు చర్యలు చేపడతామని నూతన ఎస్సై ప్రవీణ్ భోగం తెలిపారు.

22 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి: ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



ములుగు జిల్లా/వాజేడు, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):వాజేడు మండలంలో గురువారం పర్యటించిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులతో చర్చించారు.అనంతరం వాజేడు ఎంపీడీవో కార్యాలయం వద్ద 22 మంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ.22,02,552 విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అంబరాన్నంటిన పోలీసుల బతుకమ్మ సంబరాలు

- మహిళా పోలీసులతో కలిసి నృత్యాలు చేసిన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత
- ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు ప్రదానం



హనుమకొండ, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉత్సాహంగా జరిగాయి. హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన వేడుకల్లో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, సెంట్రల్ జోన్ డీసీపీ ధారా కవితతో కలిసి పాల్గొని మహిళా పోలీసు సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్ల నుంచి ఉన్నతాధికారుల వరకు ఈ వేడుకల్లో పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, డీసీపీ ధారా కవిత స్వయంగా బతుకమ్మ పాటలు ఆలపిస్తూ మహిళా సిబ్బందితో కలిసి నృత్యాలు చేయడంతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ ఆధునిక జీవనశైలికి అలవాటుపడినా మన మూలాలను, సంస్కృతి సంప్రదాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మరచిపోకూడదని సూచించారు. విధి నిర్వహణలో నిరంతరం బాధ్యతలు నిర్వర్తించే పోలీసు సిబ్బందికి ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని, ఆహ్లాదాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. హైదరాబాద్ వంటి మహానగరాలతో పోలిస్తే వరంగల్‌లో బతుకమ్మ ఉత్సవాలను ఎంతో ఘనంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ ప్రతి ఒక్కరిలో ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపారు.

ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు

వివిధ రకాల సహజ పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మను రూపొందించిన భరోసా కేంద్రం సిబ్బందికి మొదటి బహుమతిని అందజేశారు. బతుకమ్మ పాటలను చక్కగా ఆలపించిన సుబేదారి పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్ స్వప్నను కమిషనర్ అభినందించి ప్రత్యేక బహుమతిని ప్రదానం చేశారు. అనంతరం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి కొలనులో మహిళా సిబ్బంది తమ బతుకమ్మలను నిమజ్జనం చేసి, భక్తిశ్రద్ధలతో గంగాప్రవేశం నిర్వహించారు. గౌరమ్మకు సంప్రదాయబద్ధంగా వీడ్కోలు పలికారు. ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించిన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, డీసీపీ ధారా కవిత, అదనపు డీసీపీలు (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, (ఆర్ఏఆర్) సురేష్, వేముల శ్రీనివాస్‌తో పాటు పరిపాలన విభాగం ఆర్ఐ స్పర్జన్ రాజ్, సంక్షేమ విభాగం ఆర్ఐ సతీష్, మోటారు రవాణా విభాగం ఆర్ఐ శ్రీధర్, ఆర్ఎస్ఐ శ్రావణ్ తదితర సిబ్బందికి మహిళా పోలీసు సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మరో ప్రయాగ్‌రాజ్‌ను తలపించేలా మంథని పుష్కర ఘాట్ అభివృద్ధి





పెద్దపల్లి జిల్లా, మంథని, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు మంథని ముస్తాబవుతోంది. జూన్ 26 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని గోదావరి తీరంలో ఘాట్ నిర్మాణం, రహదారుల అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు మంథని గోదావరి తీరాన్ని ఆధ్యాత్మిక శోభతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

పవిత్ర గోదావరి నది తీరంలో ఉన్న మంథని పుష్కర ఘాట్‌కు ఆధ్యాత్మికంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. పుష్కరాల సమయంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ఘాట్ పరిసరాలను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాంతాన్ని మరో ప్రయాగ్‌రాజ్‌ను తలపించేలా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు

మంథని ప్రాంతంలో పుష్కరాల ఏర్పాట్ల కోసం ప్రభుత్వం మొత్తం రూ.70 కోట్ల నిధులు కేటాయించింది. మంథని ఆర్టీసీ డిపో నుంచి గోదావరి తీరం వరకు 80 అడుగుల వెడల్పుతో ప్రధాన రహదారి అభివృద్ధికి రూ.22 కోట్లు, పుష్కర ఘాట్ అభివృద్ధికి రూ.28 కోట్లు, దేవాదాయ శాఖ పరిధిలోని పనులకు రూ.10 కోట్లు, మున్సిపాలిటీ పరిధిలో టైర్–2 పనులకు రూ.10 కోట్లు కేటాయించారు.

ఈ పనులు పూర్తయితే పుష్కరాలకు వచ్చే భక్తులకు రాకపోకలు, పుణ్యస్నానాలు, ఇతర అవసరాలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

నాణ్యతపై మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి

పుష్కరాల అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. నిర్మాణాల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనుల పురోగతిని పరిశీలిస్తున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యం

2027 జూన్ 26న ప్రారంభమయ్యే పుష్కరాలకు ముందుగానే, ఏప్రిల్ నాటికి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గోదావరి తీరం నుంచి సురాబాండీసురం ఆలయం వరకు రహదారి నిర్మాణంతో పాటు 80 అడుగుల వెడల్పు ప్రధాన రహదారి అభివృద్ధి భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

ఘాట్ అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో మంథని గోదావరి తీరం పుష్కరాల సమయంలో మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. పనులను నాణ్యతతో పూర్తి చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారు: మూల సరోజన పురుషోత్తం రెడ్డి

మంథని గోదావరి తీరంలో జరుగుతున్న పుష్కర ఘాట్ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారని మాజీ జడ్పీటీసీ మూల సరోజన పురుషోత్తం రెడ్డి తెలిపారు. గోదావరి తీరం నుంచి సురాబాండీసురం ఆలయం వరకు రహదారి నిర్మాణం, 80 అడుగుల వెడల్పుతో ప్రధాన రహదారి అభివృద్ధి భక్తులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. పుష్కరాల అభివృద్ధి పనులు శాశ్వతంగా గుర్తుండిపోయేలా కొనసాగుతున్నాయని అభిప్రాయపడ్డారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణం

- **సింగరేణి బకాయిలు చెల్లించి బొగ్గు ఉత్పత్తిని పెంచాలి**
- **రైతులను కరువు కోరల్లోకి నెట్టొద్దు.. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి**





భూపాలపల్లి, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ ముందుచూపు లేని నిర్ణయాలు, విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై సరైన ప్రణాళిక లేకపోవడమే కారణమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విమర్శించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించి బొగ్గు ఉత్పత్తిని పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలను కరువు పరిస్థితుల నుంచి కాపాడాలని చేతులు జోడించి కోరుతున్నట్లు పేర్కొన్నారు.

గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సరిగా లేక మోటార్లు పనిచేయకపోవడం, పంటలకు సాగునీరు అందకపోవడంతో పాలాలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. వరి పంటలు కీలక దశలో ఉన్నందున రాబోయే 15 రోజుల నుంచి నెల రోజుల సమయం ఎంతో ముఖ్యమని, ఈ సమయంలో విద్యుత్ అంతరాయాలు కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు.

గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించామని, ప్రస్తుతం రైతులు మోటార్లు పనిచేయక, ఫ్యూజులు కాలిపోతూ, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గండ్ర పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా అధికారులను సస్పెండ్ చేయడం, వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడం వల్ల సమస్యకు పరిష్కారం లభించదని అన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెంపు, బొగ్గు సరఫరా, ముందస్తు విద్యుత్ కొనుగోళ్లపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.

రూ.60 వేల కోట్ల బకాయిలపై స్పష్టత ఇవ్వాలి

జెన్‌కో, ట్రాన్స్‌కో, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, సింగరేణి మధ్య ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని ఆయన ఆరోపించారు. ఈ బకాయిలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గడానికి కారణాలపై సమీక్ష జరపాలని కోరారు.

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గడం, మట్టి తొలగింపు పనుల టెండర్లలో రాజకీయ జోక్యం, అవినీతి ఆరోపణలు బొగ్గు సరఫరాపై ప్రభావం చూపుతున్నాయని ఆయన అన్నారు. బొగ్గు సరఫరా తగ్గితే థర్మల్ విద్యుత్ ఉత్పత్తి పడిపోతుందని, దాని ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై ఉంటుందని వివరించారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ ఉత్పత్తిపై ముందస్తు ప్రణాళిక ఏది?

గత మూడు, నాలుగు సంవత్సరాల విద్యుత్ వినియోగాన్ని ప్రస్తుత అవసరాలతో పోల్చి విశ్లేషించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గండ్ర అన్నారు. థర్మల్, సౌర విద్యుత్ కేంద్రాల ద్వారా ఎంత ఉత్పత్తి జరుగుతోంది? ఇతర వనరుల నుంచి ఎంత విద్యుత్ అందుతోంది? రాష్ట్రంలో విద్యుత్ లోటు ఎంత ఉంది? దాన్ని ఎలా భర్తీ చేయాలి? అనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కొరత ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేయాలని సూచించారు. గతంలో డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో యూనిట్‌కు రూ.12 నుంచి రూ.13 చెల్లించి అయినా విద్యుత్ కొనుగోలు చేసి రైతులకు సరఫరా చేసిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా రైతుల పంటలను కాపాడేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

చెల్పూర్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి తగ్గుదలపై ఆందోళన

భూపాలపల్లి ప్రాంతంలోని చెల్పూర్ జెన్‌కో విద్యుత్ కేంద్రంతో పాటు రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో సామర్థ్యానికి అనుగుణంగా ఉత్పత్తి జరగడం లేదని గండ్ర ఆరోపించారు. చెల్పూర్ కేంద్రం సుమారు 1,100 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండగా, ప్రస్తుతం 400 నుంచి 600 మెగావాట్ల మేర మాత్రమే ఉత్పత్తి జరుగుతోందని పేర్కొన్నారు. బొగ్గు కొరత కూడా ఇందుకు కారణమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయని తెలిపారు.

థర్మల్ విద్యుత్ ఉత్పత్తి నిరంతరంగా కొనసాగాలంటే తగిన బొగ్గు నిల్వలు, సరఫరాకు అవసరమైన ఆర్థిక వనరులు అందుబాటులో ఉండాలని అన్నారు. సింగరేణి బకాయిలను చెల్లించి, బొగ్గు ఉత్పత్తిని పెంచి విద్యుత్ కేంద్రాలకు నిరంతర సరఫరా జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

దేవాదులకు పూర్తిస్థాయిలో విద్యుత్ అందించాలి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదుల ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా సరిగా లేక మోటార్ల నిర్వహణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని గండ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల సాగునీటితో పాటు కొన్ని ప్రాంతాల్లో తాగునీటి అవసరాలపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన విద్యుత్‌ను పూర్తిస్థాయిలో అందించాలని, అవసరమైతే ఇతర రంగాల్లో విద్యుత్ వినియోగాన్ని సమీక్షించి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

విద్యుత్ రంగంలో తలెత్తిన సమస్యలపై కేంద్ర ప్రభుత్వం హెచ్చరించిన అంశాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. రైతుల పంటలను కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. రైతుల సమస్యలు పరిష్కారం కాకపోతే వారి పక్షాన మరోసారి ఉద్యమానికి దిగుతామని, అవసరమైతే రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంగశాయిపేట హత్య కేసులో 10 మందికి జీవిత ఖైదు



వరంగల్, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరంలోని రంగశాయిపేటలో 2024లో బొడ్డాయి పండుగ రోజు జరిగిన హత్య కేసులో వరంగల్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో 10 మంది నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పు ప్రకటించింది.పండుగ సందర్భంగా చోటుచేసుకున్న ఈ హత్య ఘటన అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. కేసు విచారణ పూర్తయిన అనంతరం నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది.

న్యాయస్థానం తీర్పుతో కేసులో కీలక పరిణామం

రంగశాయిపేట హత్య కేసులో 10 మందికి జీవిత ఖైదు విధిస్తూ వెలువడిన తీర్పు నగరంలో చర్చనీయాంశంగా మారింది. అయితే హత్యకు దారితీసిన కారణాలు, నిందితుల వివరాలు, న్యాయస్థానం విధించిన ఇతర శిక్షలకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

గాంధీనగర్‌లో ఇఫ్కో క్షేత్ర ప్రదర్శన

- **నానో ఎరువుల వినియోగంతో వరి సాగులో మెరుగైన ఫలితాలు**



వరంగల్ జిల్లా/సంగెం, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): ఇఫ్కో ఆధ్వర్యంలో గురువారం సంగెం మండలం గాంధీనగర్ గ్రామంలో క్షేత్ర ప్రదర్శన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో వరంగల్ జిల్లా మేనేజర్ విశాల్ షిండే పాల్గొని రైతులకు నానో ఎరువుల ప్రాముఖ్యత, వినియోగ విధానం, వాటి ప్రయోజనాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు. ఇఫ్కో ప్రతినిధులు ఏజీటీ నిఖిల్, ఎండీఓ జీవన్, ఎస్ఎఫ్ఏ రాజు రైతులకు నానో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు.అనంతరం రైతులందరూ ప్రగతిశీల రైతు అల్ల మధు వరి పొలంలో ఏర్పాటు చేసిన నానో ఎరువుల క్షేత్ర ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా నానో ఎరువుల వినియోగంతో పంటలో కనిపించిన మార్పులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నానో ఎరువులు వినియోగించిన వరి పంటలో మొక్కల పెరుగుదల, కంకుల ఏర్పాటు, గింజలు నిండిన తీరును రైతులు పరిశీలించారు. అలాగే పంటలో కలుపు మొక్కలు, చీడపీడలు, తెగుళ్ల ప్రభావానికి సంబంధించిన పరిస్థితులను గమనించారు.ఈ క్షేత్ర ప్రదర్శన ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. సాగు ఖర్చులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పంటల ఉత్పాదకతను మెరుగుపరుచుకునే అవకాశాలపై వివరించారు.

దుర్గామాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

- **తీజ్ వేడుకల్లో గిరిజనులతో కలిసి నృత్యం.. ఉత్సాహంగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే**





భూపాలపల్లి, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి గురువారం పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని రెస్క్యూ, 1 ఇంక్లైన్, 6 ఇంక్లైన్‌తో పాటు మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డి కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం కుందూరుపల్లి గ్రామంలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సోదరులు, సోదరీమణులతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేస్తూ వేడుకల్లో సందడి చేశారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే తీజ్ వేడుకల్లో పాల్గొనడంతో అక్కడి వాతావరణం పండుగ శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గిరిజన ప్రజలు, భక్తులు పాల్గొన్నారు

డాక్టరేట్ అందుకున్న గురజాల శ్రీరామ్ రెడ్డికి ఘనంగా అభినందనలు

వరంగల్ జిల్లా, సంగెం, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): దామెర మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు గురజాల శ్రీరామ్ రెడ్డి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా పలువురు ఆయనను కలిసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మొలగూరి శ్రీనివాస్, ములక ప్రసాద్, భూక్యా వెంకన్న, కాగితాల సాయికుమార్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజాసేవ, సామాజిక సేవ రంగాల్లో గురజాల శ్రీరామ్ రెడ్డి చేస్తున్న కృషికి డాక్టరేట్ మరింత గుర్తింపుగా నిలవాలని వారు ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ, ఎన్నో విజయాలు సాధించాలని కోరుకున్నారు. ఆయన సేవలు సమాజానికి మరింత ఉపయోగపడాలని ఈ సందర్భంగా అభిలషించారు.





దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు



వరంగల్, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని మట్టేవాడ ప్రాంతంలో నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత నవరాత్రి వేడుకల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు.అనంతరం నిర్వహించిన అన్నవితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. దేవీ నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికత, ఐకమత్యానికి ప్రతీకలని ఎర్రబెల్లి ప్రదీప్ రావు పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నేతాజీ యూత్ అసోసియేషన్ సభ్యులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

నిరుపేద చిన్నారి వైద్యానికి బ్యూటిఫుల్ లైఫ్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



భద్రాచలం/దుమ్ముగూడెం, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి వైద్య ఖర్చుల కోసం బ్యూటిఫుల్ లైఫ్ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం రేగుంట గ్రామానికి చెందిన 12 నెలల శిశువు సతీష్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతుండగా, చికిత్స ఖర్చుల నిమిత్తం ఫౌండేషన్ తరపున రూ.2,000 ఆర్థిక సాయం అందించారు.శిశువు హైడ్రోసెఫాలస్, హైడ్రోసిల్ సమస్యలతో బాధపడుతుండగా, గతంలో తలకు శస్త్రచికిత్స చేయించారు. మరోసారి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఫౌండేషన్ సభ్యుల దృష్టికి వచ్చింది. దీంతో స్పందించిన సభ్యులు ఫోన్‌పే ద్వారా వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో యూట్యూబర్, సామాజిక మాధ్యమాల ప్రభావశీలి మడివి సంజు స్వయంగా పాల్గొని సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ తమకు చేతనైన సహాయం అందించాలని పిలుపునిచ్చారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవాలని అన్నారు.చిన్నారి త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని పలువురు ఆకాంక్షించారు.

పోతంగల్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు



నిజామాబాద్ జిల్లా, పోతంగల్, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు పోతంగల్ మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. దీంతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ గీతాలను ఆలపిస్తూ ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ సాగిన ఈ సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, కాంగ్రెస్ నాయకులు ధనరాజ్, వెంకట్ సార్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ పండుగను ఘనంగా నిర్వహించడం ద్వారా మన సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చని తెలిపారు.బతుకమ్మ వేడుకలతో పోతంగల్ మండల కేంద్రం పూల పరిమళాలు, సంప్రదాయ గీతాలు, మహిళల కోలాహలంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, ఆడపడుచులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.5

ఒకేరోజు మూడు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం



నిజామాబాద్ జిల్లా, పోతంగల్, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ బీఆర్ఎస్ నాయకుడు, సామాజిక సేవకుడు డాక్టర్ ఎం.ఏ. హకీమ్ తన సేవా గుణాన్ని చాటుకున్నారు. ఒకేరోజు పోతంగల్ మండలంలోని మూడు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆడపిల్ల జన్మించిన కుటుంబానికి తాతయ్య కానుకగా రూ.5 వేల నగదుతో పాటు తల్లీబిడ్డకు నూతన వస్త్రాలు అందజేశారు. పక్షవాతంతో మంచానికే పరిమితమైన వ్యక్తి కుటుంబానికి, మరో మైనారిటీ కుటుంబానికి ఆర్థిక చేయూతనిచ్చారు.

ఆడపిల్ల జన్మకు తాతయ్య కానుక .... పోతంగల్ మండలం కొల్లూర్ గ్రామానికి చెందిన అర్చన కుటుంబంలో తొలి కాన్పులో ఆడపిల్ల జన్మించింది. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ ఎం.ఏ. హకీమ్ ఆ కుటుంబానికి తాతయ్య కానుకగా రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. అంతే కాకుండా తల్లికి, పాపకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఆడపిల్ల జన్మను ఆనందంగా స్వాగతిస్తూ నిరుపేద కుటుంబంలో సంతోషాన్ని నింపారు.

పక్షవాత బాధితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత.... కారేగాం గ్రామానికి చెందిన గంగా బోయ్ కుటుంబం పక్షవాతంతో మంచానికే పరిమితమైన వ్యక్తి అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వైద్య ఖర్చులకు సైతం డబ్బులు లేక కుటుంబం ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గుర్తించిన డాక్టర్ ఎం.ఏ. హకీమ్ స్పందించి తనవంతుగా నగదు రూపంలో ఆర్థిక సాయం అందించారు.అదేవిధంగా పోతంగల్ గ్రామంలోని ఓ మైనారిటీ మహిళ కుటుంబానికి కూడా ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. ఇలా ఒకేరోజు మూడు కుటుంబాలకు సాయం చేస్తూ కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే తన లక్ష్యమని చాటుకున్నారు.

మరింత మంది దాతలు ముందుకు రావాలి ... ఈ సందర్భంగా డాక్టర్ ఎం.ఏ. హకీమ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు తనకు తోచినంత సహాయం అందిస్తున్నానని తెలిపారు. తాను అందించే సాయం మాత్రమే ఆయా కుటుంబాల సమస్యలను పూర్తిగా పరిష్కరించలేదని, మరింత మంది దాతలు ముందుకు వచ్చి నిరుపేదలకు అండగా నిలవాలని కోరారు.నిరుపేద కుటుంబాలకు ఆపన్నహస్తం అందించడం, ఆడపిల్లల జన్మను గౌరవించడం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తోడ్పాటు అందించడం ద్వారా సమాజంలో మానవత్వం, సేవాభావం మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.ఒకేరోజు మూడు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించిన డాక్టర్ ఎం.ఏ. హకీమ్ సేవలను ఆయా గ్రామాల ప్రజలు, బాధిత కుటుంబ సభ్యులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో గుండు సుధారాణి



హనుమకొండ, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో గురువారం మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో నిర్వహించిన వరంగల్ ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, గ్రేటర్ వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె ప్రసంగించారు.ఈ సమావేశానికి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి హాజరయ్యారు.రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ సన్నాహాలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై నాయకులు సమావేశమయ్యారు.ఈ కార్యక్రమంలో ఎంపీలు బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, యశస్విని రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, లకావత్ ధన్వంతి, పైడాకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రాజ్యాంగ పరిరక్షణకు సమరశంఖం



హనుమకొండ/ఎల్కతుర్తి, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): భారత రాజ్యాంగంపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లేనని రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఎల్కతుర్తిలో నిర్వహించిన మండల సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకత, ప్రజాస్వామ్య విలువల ప్రాధాన్యతను వివరించారు.భారత రాజ్యాంగాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా బలహీనపరిచేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే, మతతత్వ భావజాలాన్ని ప్రోత్సహించే విధానాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను అందించిందని కవ్వ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కులం, మతం, ప్రాంతం, భాష అనే భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించడం రాజ్యాంగ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు పౌరుల గౌరవప్రదమైన జీవితానికి భరోసా కల్పిస్తాయని, ప్రాథమిక విధులు దేశ సమగ్రత, ఐక్యతను కాపాడాల్సిన బాధ్యతను గుర్తుచేస్తాయని అన్నారు.రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం మాత్రమే కాదని, కోట్లాది ప్రజల హక్కులు, ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని, ప్రజల్లో రాజ్యాంగ హక్కులపై అవగాహన పెంపొందించాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలను చైతన్యపరచడం ప్రతి ప్రజాస్వామ్యవాది బాధ్యతని స్పష్టం చేశారు.

ఏకగ్రీవంగా మండల నూతన కమిటీ ఎన్నిక

సమావేశం అనంతరం రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక ఎల్కతుర్తి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా న్యాయవాది గడ్డం సంజీవ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా పర్లపల్లి పృథ్వీరాజ్, మండల సమన్వయకర్తగా సాతూరి రాజమౌళి ఎన్నికయ్యారు.మండల ఉపాధ్యక్షులుగా అంబాల స్వామి, జూపాక శీను, నిమ్మల మనోహర్, ఆరెపల్లి రాజయ్య, పాటి భగవాన్ గౌడ్, కార్యదర్శిగా బొంకురి కార్తీక్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా పెండ్యాల సుదర్శన్, మేకల రవీందర్ ఎంపికయ్యారు.నూతన కమిటీ సభ్యులకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల ప్రచారం, ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాతూరి చంద్రమౌళి, చదిరం నాగేశ్వర్, సాతూరి ప్రసాద్, మారపాక అనిల్ కుమార్, కట్కూరి రాజేందర్, జూపాక జడ్సన్, బొంకురి రవీందర్, రేణికుంట్ల సాంబయ్య, మంకయ్య, అడ్డూరి అనిల్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు

- **ఘణపురం పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఘణపురం పోలీస్‌స్టేషన్‌తో పాటు సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాల నిర్వహణ, పరిశుభ్రత, రికార్డులు, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణను పరిశీలించారు. అధికారులతో, సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణ, పనితీరు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.పోలీస్‌స్టేషన్‌లోని నిఘా కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ.. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణ, నిరంతర పోలీసు గస్తీ, ప్రజలకు పోలీసుల ఉనికి కనిపించేలా విధుల నిర్వహణ, సమాజ భాగస్వామ్యంతో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలను అరికట్టడంతో పాటు రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు.ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ నేరాల దర్యాప్తు వంటి ఆధునిక సాంకేతిక విధానాలపై సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ పోలీసుశాఖపై నమ్మకాన్ని పెంపొందించాలని తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు.ఈ తనిఖీల్లో భూపాలపల్లి ఉపవిభాగ పోలీసు అధికారి సంపత్ రావు, ఘణపురం సీఐ కర్ణాకర్ రావు, ఎస్ఐ అశోక్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com